దేశాభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరు..

విశ్వంభర, నేషనల్ బ్యూరో : దేశాన్ని విచ్ఛిన్నం చేయాలనుకునే దిమాగీ నక్సల్స్ పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ప్రధాని నరేంద్రమోడీ సూచించారు. భారత వ్యతిరేక శక్తులన్నీ ఏకమై, దేశంలో విభజనను ప్రోత్సహించాలని కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. సామాజిక మాధ్యమాల వేదికగా అబద్ధాలను, వదంతులను వ్యాప్తి చేస్తూ అస్థిరతను సృష్టించే పనిలో నిమగ్నమయ్యాయని మండిపడ్డారు. ప్రజలంతా ఐక్యంగా ఉండాలని ప్రధాని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. దేశ ఐక్యతే మనల్ని ఒక జాతిగా ముందుకు నడిపిస్తుందని ఆయన ఉద్ఘాటించారు. ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆశయాలను స్మరించుకుంటూ, ఆయన చూపిన మార్గంలోనే నేడు దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

ఇది భారత సామర్థ్యానికి చిహ్నం!

ప్రపంచవ్యాప్తంగా రాజకీయ ఉద్రిక్తతలు, ఇంధన కొరత నెలకొన్నప్పటికీ, ఈ సంక్షోభాల నుంచి భారత పౌరులను కాపాడుకోగలిగాం. ఇది భారతదేశ సామర్థ్యానికి నిదర్శనమని ప్రధాని మోదీ అన్నారు. "ఇటీవలి కాలంలో ప్రపంచం ఇంధన సంక్షోభంతో సతమతమవ్వడం మనం చూశాం. కొన్ని దేశాల్లో డీజిల్, పెట్రోల్ కొనుగోళ్లపై పరిమితులు కూడా విధించాల్సి వచ్చింది. భారీ జనాభా కలిగి ఉండి, స్వదేశీ పెట్రోలియం ఉత్పత్తి తక్కువగా ఉన్న భారత్‌లో అతిపెద్ద సంక్షోభం తలెత్తుందని అప్పట్లో అంచనాలు వేశారు. ఇలాంటి ఆందోళనల మధ్య, భారత వ్యతిరేక శక్తులు కూడా చురుగ్గా మారాయి. అయితే ఈ ప్రపంచ ఇంధన సంక్షోభం మన పౌరులపై ఎలాంటి ప్రభావం చూపకుండా అడ్డుకోగలగడం భారతదేశ సామర్థ్యానికి నిదర్శనం" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా నెలకొని ఉన్న అస్థిర పరిస్థితులను ప్రస్తావిస్తూ, భారతీయుల ఐక్యతే దేశానికి అతిపెద్ద రక్షణ కవచమని అన్నారు.

స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశంలో పేదరిక నిర్మూలన గురించి చర్చలు జరుగుతున్నాయి. పేదరికాన్ని తొలగిస్తామని చెప్పి ఇంతకు ముందు ఓట్లు అడిగారు. కానీ దేశంలో పేదరికం ఏ స్థితిలో ఉందో మనందరికీ తెలుసు. పేదరికాన్ని తొలగిస్తామని నినాదాలు చేసిన వారేమో మరింత ధనవంతులు అయ్యారని మోదీ పేర్కొన్నారు. కానీ ప్రస్తుతం భారత్ అపూర్వమైన శక్తితో, దృఢ సంకల్పంతో ఉందని, దేశ ప్రజల్లో పెరుగుతున్న ఆత్మవిశ్వాసమే ఇందుకు కారణమని అన్నారు.

ఉక్కుమనిషికి ఘన నివాళులు..

ఉక్కుమనిషి, మాజీ ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 151వ జయంతి సందర్భంగా ప్రధాని మోడీ ఆయనకు ఘన నివాళి అర్పించారు. గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో ఉన్న పటేల్ భారీ విగ్రహం స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద ప్రధాని పుష్పాంజలి ఘటించారు. దేశ సమగ్రతకు, భారతజాతి నిర్మాణానికి పటేల్ చేసిన సేవలను కొనియాడారు. దృఢమైన, సంపన్నమైన, సమర్థవంతమైన దేశ నిర్మాణానికి తన జీవితాన్ని అంకితం చేశారని తన సందేశంలో పేర్కొన్నారు. పటేల్‌కు నివాళులు అర్పించిన తర్వాత ఏక్తానగర్‌లో నర్మదా మాత విగ్రహం నుంచి రెప్లికా గార్డెన్ వరకు సాయుధ దళాల పరేడ్ అట్టహాసంగా జరిగింది. దాదాపు 10 వేల మంది పోలీస్, పారామిలటరీ దళాలు ఈ కార్యక్రమంలో కవాతు నిర్వహించాయి. వాయుసేన నిర్వహించిన అద్భుతమైన ఫ్లైపాస్ట్, భద్రతా బలగాల మోటార్ సైకిల్ విన్యాసాలు, డాగ్ స్క్వాడ్ ప్రదర్శనలు, మార్షల్ ఆర్ట్స్, అశ్వ, ఒంటె దళాల కవాతు చూపరులను ఆకట్టుకున్నాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన 4వేల 700 మంది కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు భారతీయ సంస్కృతి, భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటిచెప్పాయి. అనంతరం ప్రసంగించిన ప్రధాని మోదీ, దేశం బాహ్యం నుంచి ఎదురవుతున్న సవాళ్లకు పరిష్కారాలు అన్వేషిస్తున్న సమయంలో కొన్ని శక్తులు మాత్రం అబద్ధాలు, వదంతులు వ్యాప్తి చేస్తూ అస్థిరతను సృష్టించే ప్రయత్నంలో నిమగ్నమయ్యాయని మండిపడ్డారు. దేశంలో విభజన సృష్టించాలని కుట్ర చేస్తున్న దిమాగీ నక్సల్స్ పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వ్యాఖ్యానించారు.

కాచం సత్యనారాయణ కుటుంబానికి పరామర్శ

విశ్వంభర, నల్గొండ : తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కాచం సత్యనారాయణ తండ్రి కీర్తిమయ్య ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన విషయం విదితమే. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి శనివారం అమ్మనబోలులోని నివాసానికి చేరుకుని సత్యనారాయణను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కీర్తిమయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి స్థైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వెంకటనారాయణ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జునరెడ్డి, మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్, మాజీ ఎంపీటీసీ కట్టమూరి సత్తయ్య గౌడ్, మాజీ సర్పంచి బద్దం వరలక్ష్మి రాంరెడ్డి, గ్రామ శాఖ బాధ్యులు, పార్టీ అధ్యక్షుడు కొమ్ము యాదగిరి, వివిధ గ్రామాల సర్పంచ్ లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు సోల ప్రసాద్, బోడ అనిల్ రవి, షేక్ హోలీ మమ్మద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గొంతుకను కాపాడేందుకే విపక్షాల పోరాటం

(మొదటి పేజీ తరువాయి)

న్నారు. జ్ఞానేశ్ కు వ్యతిరేకంగా తాము సేకరించిన ఆధారాలను బయటపెట్టిన తర్వాత కూడా బీజేపీ ఆయనను ఆ పదవిలో ఉంచాలని పట్టుపడితే అప్పుడు ఆ పార్టీ అసలు ఉద్దేశం ఏమిటో స్పష్టమవుతుందన్నారు. ఢిల్లీలో నిర్వహించిన 'మాక్ పార్లమెంట్' సమావేశంలో ఆయన మాట్లాడారు. పౌరుల సమావేశంలో మాత్రమే కాకుండా ఎన్నికల ప్రక్రియను దెబ్బతీయడంలో భాగస్వాములైన వారందరికీ వ్యతిరేకంగా ప్రయోగించే ఒక రాజకీయ ఆయుధంగా మారాలని రాహుల్ పిలుపునిచ్చారు. దేశంలో ఎన్నికల వ్యవస్థను దెబ్బతీసిన వారిలో ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా కూడా ఉన్నారని ఆరోపించారు. 'ఓట్ చోరీలో భాగస్వాములైన వారు ఎప్పటికీ ఆ సంస్థ (ఎన్నికల సంఘం) వెనుక దాక్కోలేరు. ఏదో ఒక రోజు మీరు భారత ప్రజల ప్రతినిధులను తప్పకుండా ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం మోదీ, షాలు టార్గెట్‌లో ఉన్నారు. వారి సంగతి మేం చూసుకుంటాం. కానీ మీరు వారికి సాధనాలుగా పనిచేస్తున్నారు. కాబట్టి మీరే మా మొదటి టార్గెట్. రేపు ఢిల్లీ వీధుల్లో ఒక రాజకీయ అస్త్రాన్ని ప్రయోగిస్తాం. ప్రతిపక్షాలు ఐక్యంగా దేశ ప్రజల మనోభావాలు ఎలా ఉన్నాయో స్పష్టంగా చూపిస్తాయి' అని రాహుల్ వ్యాఖ్యానించారు.

ర్యాలీకి ఏర్పాట్లు పూర్తి

మరోవైపు, సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా రామ్‌లీలా మైదానంలో ఆదివారం జరగనున్న ఇండియా కూటమి మెగా ర్యాలీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. వివిధ రాష్ట్రాల నుంచి ప్రతిపక్ష నాయకులు, ఆయా పార్టీల మద్దతుదారులు దిల్లీకి చేరుకుంటున్నారు. కాగా, రామ్‌లీలా మైదానంలోని ప్రధాన వేదికపై భారీ త్రివర్ణ పతాకాన్ని ఏర్పాటు చేశారు. అంతేకాకుండా ఇండియా కూటమిలోని పార్టీల ప్రతినిధులు కూర్చోవడానికి స్టేజ్‌పై ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మింటో రోడ్ నుంచి రామ్‌లీలా మైదానం వరకు మార్చ్ (భారీ పాదయాత్ర) చేపట్టాలని, ఆ తర్వాత రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, పౌర సమాజ సంస్థలను ఏకతాటిపైకి తెచ్చే ర్యాలీని చేపట్టాలని విపక్షాలు నిర్ణయించాయి.

భారత్‌లో తగ్గిన ఆర్థిక అసమానతలు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: 'ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలో పేదరిక నిర్మూలన, సంక్షేమం, ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన దిశగా చేపట్టిన కార్యక్రమాలు అద్భుతమైన ఫలితాలను అందిస్తున్నాయి. ప్రపంచ బ్యాంకు తాజాగా విడుదల చేసిన పావర్టీ అండ్ ఈక్విటీ2026 (పేదరికం, సమానత్వం) నివేదికలో భారత్ సాధిస్తున్న ప్రగతిని గురించి ప్రత్యేకంగా కొనియాడటం సంతోషకరం. 201112లో 27.1 శాతం ఉన్న 'అత్యంత పేదరికం' 202324 నాటికి 2.6 శాతానికి తగ్గింది. అదే సమయంలో 49.6 కోట్ల మంది పేదరికం నుంచి బయటకు వచ్చారు. 2017 నుంచి 2023 మధ్యలో భారత్‌లో ఉపాధి అవకాశాలు 13.4 కోట్ల మేర పెరిగాయి. ముఖ్యంగా గ్రామీణ మహిళలు ఉపాధి రంగంలోకి పెద్ద సంఖ్యలో అడుగు పెట్టారు. తద్వారా వెనుకబడిన కుటుంబాల ఆదాయం భారీగా పెరిగిందని ప్రపంచబ్యాంకు నివేదిక పేర్కొంది.ఇది హర్షించదగిన అంశం' అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు తీసుకొచ్చాయని తెలిపారు. జాతీయ ఆహార భద్రత చట్టం ద్వారా 80 కోట్ల మందికి మోడీ సర్కారు ఉచితంగా బియ్యం, ఆహార ధాన్యాలను అందిస్తోందని చెప్పారు. ప్రజల్లో ఆదాయ అసమానతలను తగ్గించడంలో కూడా భారత్ పురోగతి సాధించిందని, గినీ సూచీలో భారత్ స్కోరు 23గా నమోదైందని వెల్లడించారు. అమెరికా (41.8), చైనా (36), జర్మనీ (33.7), యూకే (32.4), ఫ్రాన్స్ (31.8), బ్రెజిల్ (50.3), దక్షిణాఫ్రికా (54.1) వంటి దేశాల కన్నా చాలా తక్కువని, గినీ ఇండెక్స్ ఎంత తక్కువగా ఉంటే ఆదాయ సమానత్వం అంత ఎక్కువగా ఉన్నట్లు అర్థమని చెప్పారు. పేదరిక నిర్మూలన, మహిళా సాధికారత, ఉపాధి కల్పన, ఆహార భద్రత, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ప్రజల నమ్మకమే తమ ప్రభుత్వాన్ని ముందుకు నడిపిస్తోందని, 140 కోట్ల మంది ప్రజలకు మరిన్ని అవకాశాలు కల్పిస్తూ.. వారి సంక్షేమానికి కృషి చేస్తూ.. దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తూ.. వికసిత్ భారత్ నిర్మాణం దిశగా దృఢ సంకల్పంతో ఇదే విధంగా ముందుకు సాగుతుందని వివరించారు.

పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికల హడావుడి

విశ్వంభర, నేషనల్ బ్యూరో : పంజాబ్‌లో అసెంబ్లీ ఎన్నికల హడావుడి మొదలైంది. వచ్చే ఏడాదిలో జరగనున్న ఈ ఎన్నికల కోసం ఆమ్ ఆద్మీ పార్టీ 40 మంది అభ్యర్థులతో కూడిన తమ మొదటి జాబితాను శనివారం విడుదల చేసింది. ముఖ్యమంత్రి భగవంత్ మాన్ తన ప్రస్తుత నియోజకవర్గమైన ధూరి నుంచి మళ్లీ పోటీ చేయనున్నారు. పంజాబ్ శాసనసభ స్పీకర్ కుల్తార్‌సింగ్ సంధ్వాన్ కోట్‌కపురా స్థానం నుంచి బరిలో ఉన్నారు. ప్రస్తుతం జైలులో ఉన్న మంత్రి సంజీవ్ అరోరాను లూథియానా వెస్ట్ నుంచి ఖరారు చేశారు. ఈ మేరకు ఆ పార్టీ జాతీయ కార్యదర్శి పంకజ్ కుమార్ గుప్తా ప్రకటన విడుదల చేశారు.ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ నివాసంలో శనివారం జరిగిన పొలిటికల్ అఫైర్స్ కమిటీ (పీఏసీ) సమావేశంలో అభ్యర్థుల పేర్లను ఖరారు చేశారు. ఈ కీలక సమావేశానికి కేజ్రీవాల్, పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, పంజాబ్ ఇన్‌ఛార్జ్ మనీశ్ సిసోదియా, ఆర్థిక మంత్రి హర్పాల్ చీమా ఇతర పీఏసీ సభ్యులు హాజరయ్యారు. ప్రకటన అనంతరం అభ్యర్థులకు కేజ్రీవాల్ ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలియజేశారు.

ఎవరెవరికి చోటు దక్కిందంటే?

తాజాగా ప్రకటించిన ఈ జాబితాలో పలువురు ప్రముఖ మంత్రులకు అవకాశం దక్కింది. అజ్నాలా నుంచి కుల్దీప్ సింగ్ ధాలివాల్, కర్తార్‌పూర్ నుంచి బాల్కర్ సింగ్, గర్హ్‌శంకర్ నుంచి జై క్రిషన్ సింగ్ రౌరి, ఎస్.ఎ.ఎస్ నగర్ నుంచి కుల్వంత్ సింగ్, భదౌర్ నుంచి లభ్ సింగ్ ఉగోకేలతో సహా పలువురు ఇతర మంత్రులు బరిలో ఉన్నారు. ఇతర ముఖ్య అభ్యర్థుల్లో మోగా నుంచి అమన్‌దీప్ కౌర్ అరోరా, బటాలా నుంచి అమన్‌షేర్ సింగ్, అమృత్‌సర్ సౌత్ నుంచి ఇందర్‌బీర్ సింగ్ నిజ్జర్, తరన్ తారన్ నుంచి హర్మీత్ సింగ్ సంధు, ఖేమ్ కరణ్ నుంచి సర్వన్ సింగ్ ధున్, నకోదర్ నుంచి ఇంద్రజిత్ కౌర్ మాన్ ఉన్నారు

'ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేయడం మన బాధ్యత'..

పార్టీ అభ్యర్థుల పేర్లను ప్రకటించిన అనంతరం, మనీశ్ సిసోదియా కూడా ఎక్స్ వేదికగా స్పందించారు. "ఆమ్ ఆద్మీ పార్టీ ప్రకటించిన 40 మంది అభ్యర్థులందరికీ అభినందనలు! ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేయడం మన బాధ్యత. ప్రతి గడపగడపకి వెళ్లి ప్రజల సమస్యలను స్వయంగా వినండి. పంజాబ్ పురోగతికి మీ పూర్తి శక్తిని వెచ్చించండి" అని సిసోదియా ఎక్స్ పోస్టులో రాసుకొచ్చారు.

ఎన్నికల నిర్వహణపై ఈసీ సన్నద్ధత

మరోవైపు, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల సన్నద్ధతపై బుధవారం భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రతినిధి బృందం జిల్లా వారీగా సమీక్ష నిర్వహించింది. ఈ బృందంలో సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ పవన్ కుమార్ శర్మ, డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ భాను ప్రకాశ్ యెటూరు, డైరెక్టర్ జనరల్ (ఐటీ)అనిశ్ గోయల్ సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్రంలోని 23 మంది జిల్లా ఎన్నికల అధికారులు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు పాల్గొని, ఎన్నికల ఏర్పాట్లపై చర్చించారు. వీరంతా తమ జిల్లాల్లో ఎన్నికల నిర్వహణ గురించి పరిస్థితిని వివరించారు. ఎన్నికల నియమావళిని పారదర్శకతను కచ్చితంగా పాటించాలని అధికారులు సూచించారు. పంజాబ్ ప్రధాన ఎన్నికల అధికారి స్పందిస్తూ ఎలాంటి అక్రమాలు లేకుండా ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.పంజాబ్ శాసనసభా గడువు 2027 మార్చి 16నాటికి ముగియనుంది. 117 అసెంబ్లీ స్థానాలున్న పంజాబ్‌లో వచ్చే ఏడాది ఫిబ్రవరి లేదా మార్చిలో శాసనసభా ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఆమ్‌ఆద్మీ, కాంగ్రెస్, శిరోమణి అకాలీదళ్, బీజేపీ మధ్య ప్రధాన పోటీ ఉండనుంది. శిరోమణి అకాలీదళ్, బీజేపీ కలిసి పోటీ చేసే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

మాక్ పార్లమెంట్ లో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి

విశ్వంభర, ఢిల్లీ: సీఈసీ జ్ఞానేష్ కుమార్ ను అభిశంసిస్తూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నివాసంలో ఇండియా కూటమి నేతలు శనివారం సాయంత్రం మాక్ పార్లమెంట్ నిర్వహించారు. మాక్ పార్లమెంట్ కు మాజీ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షత వహించారు. మాక్ పార్లమెంట్ లో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ, విపక్ష నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇండియా కూటమి ఎంపీలు, నేతలు పాల్గొన్నారు.

ఐఎఎఫ్ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన మార్షల్ అశుతోష్ దీక్షిత్

విశ్వంభర, నేషనల్ బ్యూరో : భారత వైమానిక దళ చీఫ్‌గా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు స్వీకరించారు. ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ శనివారం పదవీ విరమణ చేయగా.. దీక్షిత్ బాధ్యతలు చేపట్టారు. దాదాపు 20 రకాల యుద్ధ విమానాలను నడిపిన అనుభవం ఉన్న అశుతోష్ దీక్షిత్.. 2028 డిసెంబర్ 31 వరకు ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు. వ్యూహాత్మక ప్రణాళికల్లో పేరొందిన ఆయన ఆపరేషన్ సిందూర్ సమయంలో కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే.1966 డిసెంబర్ 9న జన్మించిన ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ .. 1986 డిసెంబర్ 6న వాయుసేనలో చేరారు. నాలుగు దశాబ్దాల కాలంలో వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. మిరాజ్ 2000, కిరణ్, మిగ్, జాగ్వార్, తేజస్ వంటి యుద్ధ విమానాల్లో 3,500 గంటలకు పైగా విమానయానం చేసిన అనుభవం ఉంది. ఆపరేషన్ సఫేద్ సాగర్, ఆపరేషన్ రక్షక్, ఆపరేషన్ సిందూర్ వంటి అనేక కీలక ఆపరేషన్‌లలో పనిచేశారు.

రిజర్వాయర్లలో నీటి నిల్వలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి

విశ్వంభర, హైదరాబాద్ : వర్షపు నీరు భూగర్భంలోకి ఇంకేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఇంకుడు గుంతలు, మ్యాజిక్ పిట్ల నిర్మాణాలు రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఎల్‌నినో, నీటి పొదుపుపై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. గ్రామీణ తాగునీటి సరఫరా ఇంజినీర్లతో సీతక్క శనివారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎల్‌నినో నేపథ్యంలో సింగూరు ప్రత్యామ్నాయ తాగునీటి అవసరాలకు రూ.120 కోట్లు మంజూరు చేసినట్లు చెప్పారు.సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు ప్రత్యేక నిధులు కేటాయించామని, ఇతర జిల్లాల్లో తక్షణ తాగునీటి అవసరాలకు రూ. కోటి చొప్పున నిధులు వెచ్చించామని చెప్పారు. తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నీటి ఎద్దడి ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరాకు ఏర్పాట్లు చేయాలన్నారు. చేతిపంపులు, బావులు, స్థానిక నీటి వనరులను అందుబాటులో ఉంచాలని, రిజర్వాయర్లలో నీటి నిల్వలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించలేదు

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: రాష్ట్రంలో ప్రభుత్వం క్రాప్ హాలిడే ప్రకటించిందంటూ ప్రతిపక్షాలు చేస్తున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని, రైతులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను మానుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల వల్ల వర్షపాతం, నీటి లభ్యతలో మార్పులు వచ్చే అవకాశం ఉన్నందున, అధిక నీరు అవసరమయ్యే పంటలు వేసి చివరి దశలో రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో గత ఆరు నెలలుగా ఆరుతడి, సమీకృత పంటల సాగును ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. రైతు వేదికలు, ప్రతి వారం నిర్వహించే 'రైతునేస్తం' కార్యక్రమం ద్వారా భూగర్భ జలాలు, వాతావరణ పరిస్థితులపై రైతులకు ఎప్పటికప్పుడు సమాచారం అందిస్తూ తక్కువ నీటితో సాగయ్యే పంటలపై మార్గనిర్దేశం చేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే రైతు వేదికల ద్వారా సబ్సిడీపై 28,460 క్వింటాళ్ల వేరుశనగ, 26,847 క్వింటాళ్ల శనగలు, 1,369 క్వింటాళ్ల మినుములు, 703 క్వింటాళ్ల పెసలు, 200 క్వింటాళ్ల పొద్దుతిరుగుడు, 174 క్వింటాళ్ల కుసుమ, 148 క్వింటాళ్ల నువ్వుల విత్తనాలను రైతులకు అందజేస్తున్నట్లు స్పష్టం చేశారు.

365 కరువు మండలాల ప్రకటన..

ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని, ప్రస్తుతం ఖరీఫ్ పంటలకు కనీస మద్దతు ధర కంటే ఎక్కువ ధర లభిస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి, పంట నష్టంపై క్షేత్రస్థాయి సర్వేకు ఆదేశాలు ఇచ్చామన్నారు. సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో రైతులకు ధైర్యం చెప్పాల్సిన ప్రతిపక్షాలు, తప్పుడు ప్రచారాలతో ఆందోళన కలిగించడం సరికాదని హితవు పలికారు. రైతులకు దీర్ఘకాలిక ఆదాయాన్నిచ్చే ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు ప్రభుత్వం అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తోందని మంత్రి తుమ్మల తెలిపారు. ఇందుకోసం నర్సరీల వద్ద నవంబర్ నెలకు 10.99 లక్షలు, డిసెంబర్‌కు 6.19 లక్షలు, జనవరికి 5.20 లక్షలు, ఫిబ్రవరికి 4.65 లక్షలు, మార్చి నెలకు 4.18 లక్షల చొప్పున నాణ్యమైన మొక్కలను అందుబాటులో ఉంచామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఇండీ కూటమి మాక్ పార్లమెంట్

విశ్వంభర, నేషనల్ బ్యూరో : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, హోం మంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల కమిషన్‌ను నడుపుతున్నారని రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే విమర్శించారు. దీనివల్ల దేశంలో సామాన్యుడి ఓటు హక్కు ప్రమాదంలో పడిందని ఆరోపించారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని రద్దు చేయాలని, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియను నిలిపివేయాలని ఖర్గే డిమాండ్ చేశారు. శనివారం ఢిల్లీలోని ఖర్గే అధికారిక నివాసంలో లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ అధ్యక్షతన ప్రతిపక్ష ఇండీ కూటమి 'మాక్ పార్లమెంట్' సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ 'బహిరంగ ప్రజా అభిశంసన' తీర్మానం ప్రవేశపెట్టింది. అనంతరం ఖర్గే మాట్లాడుతూ, సీఈసీ కుమార్‌పై 'ఆరోపణలను' సభలో చదివి వినిపించారు. జ్ఞానేశ్ కుమార్ దేశద్రోహానికి పాల్పడ్డారని ఖర్గే ఆరోపించారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని రద్దు చేసి ఆయనను ఆ పదవిలో నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సీఈసీని తొలగించాలని కోరుతూ ప్రతిపక్ష ఎంపీలు ఇప్పటికే పార్లమెంటు ఉభయ సభలలో ప్రతిపాదనలు ప్రవేశపెట్టారని, కానీ తమ నోటీసులను స్వీకరించలేదని ఖర్గే చెప్పారు. అందువల్లే ఈ సమావేశం నిర్వహించాల్సి వచ్చిందని పేర్కొన్నారు. 'రాజ్యాంగబద్ధ సంస్థ గౌరవాన్ని కాపాడటానికే ఈరోజు ఈ ప్రతిపాదనను తీసుకువచ్చాం. సీఈసీపై మాకు ఎలాంటి వ్యక్తిగత విద్వేషం లేదు. ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా పనిచేయాలని మేం కోరుకుంటున్నాం. 2014 నుంచి అధికారంలో కొనసాగేందుకు మోడీ ప్రభుత్వం అన్ని కుట్రలు చేస్తోంది. 2023 చట్టం కల్పిస్తున్న రక్షణ కారణంగానే సీఈసీ ఓటు చోరీకి పాల్పడుతున్నారు. సర్ ప్రక్రియ ద్వారా దేశంలో ఉద్దేశపూర్వకంగానే 14 కోట్ల మంది ఓట్లను తొలగించారు. ఈ చట్టం ఆయనకు అన్ని విధాల చర్యల నుంచి రక్షణ కల్పిస్తోంది. 145 మంది ప్రతిపక్ష ఎంపీలను పార్లమెంటు నుంచి సస్పెండ్ చేసి, వారిని సభా కార్యకలాపాలలో పాల్గొనకుండా నిరోధించిన తర్వాత ఈ చట్టాన్ని ఆమోదించారు. అందుకే దీన్ని వెంటనే రద్దు చేయాలి. సర్ ప్రక్రియను నిలిపివేసి అక్రమంగా తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి. దేశంలో ఎన్నికలు ఏవైనా సరే వాటిని బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించాలి. ఇవే ఇండీ కూటమి ప్రధాన డిమాండ్లు' అని ఖర్గే అన్నారు.

రాష్ట్రపతికి, సుప్రీం న్యాయమూర్తికి కూడా ఆ స్థాయి రక్షణ లేదు : ఖర్గే

ఓటు హక్కు వయస్సును 18 ఏళ్లకు తగ్గించి యువతకు, దేశ భవిష్యత్తును నిర్ణయించే హక్కును మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ ఇచ్చారని, కానీ ఆ హక్కును మోదీ ప్రభుత్వం ఇప్పుడు ఆ హక్కును లాక్కుంటుందని ఆరోపించారు. రాష్ట్రపతికి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి కూడా లేని రక్షణను 2023 చట్టం సీఈసీకి ఇస్తుందని అన్నారు. తాము చొరబాటుదారుల కోసం ఓటు హక్కులను కోరడం లేదని, కానీ భారత పౌరులందరి ఓటు హక్కును రక్షించాలని అన్నారు. కాగా, అంతకుముందు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ఖర్గే నివాళులర్పించారు. ఇక లోక్‌సభను పోలి ఉన్నట్లుగా ఈ మాక్ పార్లమెంట్ వేదికను ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి అన్ని రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, ఇండీ కూటమి నేతలు, ప్రతిపక్ష ఎంపీలు హాజరయ్యారు.

పారిశ్రామిక ప్రగతి.. నైపుణ్య యువతే కీలకం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: దేశ ఆర్థిక ప్రగతికి పారిశ్రామికాభివృద్ధి, నైపుణ్యం కలిగిన మానవ వనరులు కీలకమని రాష్ట్ర శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు శిక్షణ ఇచ్చి, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. శనివారం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ స్వర్ణోత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సులో మంత్రి పాల్గొని ప్రసంగించారు. దేశం ఏటా 8 శాతం స్థిరమైన ఆర్థిక వృద్ధి సాధిస్తేనే అభివృద్ధి చెందిన దేశంగా ఎదగగలదని పేర్కొన్నారు. ఇందుకు పరిశోధన, నూతన ఆవిష్కరణలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కృత్రిమ మేధ (ఏఐ) విస్తరణతో ఉద్యోగ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగుపరుచుకోవాలని సూచించారు.పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య మానవ వనరులను తయారు చేయడమే లక్ష్యంగా రాష్ట్రంలోని 65 ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మార్చినట్లు మంత్రి తెలిపారు. ఇందుకోసం దాదాపు రూ.4 వేల కోట్ల పెట్టుబడితో ఆధునిక శిక్షణ సదుపాయాలు కల్పించామని, వచ్చే ఏడాది మరో 54 కేంద్రాలను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పరిశ్రమల ప్రతినిధులతో సంప్రదింపులు జరిపి, వారి అవసరాలకు అనుగుణంగా కోర్సులు, పాఠ్యప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ సంస్థలు, పరిశ్రమల మధ్య నైపుణ్యాల అంతరాన్ని తగ్గించడమే ఈ కార్యక్రమాల ఉద్దేశమన్నారు. జర్మనీ, జపాన్ వంటి దేశాల్లో నైపుణ్యం కలిగిన కార్మికులకు డిమాండ్ పెరుగుతోందని, ఆయా దేశాల్లో ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునేలా యువతకు సాంకేతిక నైపుణ్యాలతోపాటు స్థానిక భాష, పని సంస్కృతి, క్రమశిక్షణపై శిక్షణ ఇవ్వాలని అన్నారు. విదేశీ ఉద్యోగాల ద్వారా లభించే ఆదాయం, స్వదేశానికి పంపే నగదు దేశ ఆర్థిక వ్యవస్థకు దోహదపడతాయని వివరించారు. ఆర్థిక వృద్ధి అంటే కేవలం జీడీపీ పెరగడం మాత్రమే కాదని, ప్రజల ఆదాయాలు, ఉపాధి అవకాశాలు పెరగడంతోపాటు సంక్షేమ కార్యక్రమాలకు ప్రభుత్వానికి మరిన్ని నిధులు అందుబాటులోకి రావడమని మంత్రి పేర్కొన్నారు. ఐదు దశాబ్దాలుగా మానవ వనరుల అభివృద్ధికి సేవలందిస్తున్న డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థను అభినందించారు.

ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి తెలంగాణ కేంద్రం

విశ్వంభర, ,ఇబ్రహీంపట్నం : తెలంగాణను దేశంలోనే ప్రముఖ ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. టెక్నాలజీ, ఇన్నోవేషన్, తయారీ రంగాలను అనుసంధానిస్తూ సమగ్ర పారిశ్రామిక వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలోని ఈసిటీ లో ఆవిష్కరణ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.200 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన మివి (ఎంఐవిఐ) నూతన తయారీ కేంద్రాన్ని శనివారం మంత్రి శ్రీధర్‌బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తయారీ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ తయారీ రంగం 7.7 శాతం వృద్ధి రేటును నమోదు చేసిందని మంత్రి వెల్లడించారు. రాష్ట్ర పారిశ్రామిక స్థూల విలువ జోడింపులో (జీఎస్‌వీఏ) తయారీ రంగం వాటా రూ.1.37 లక్షల కోట్లకు చేరినట్లు తెలిపారు. తెలంగాణ రైజింగ్-2047 విజన్‌లో భాగంగా ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్లు, హార్డ్‌వేర్ పార్కులను మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని వివరించారు.

గ్లోబల్ సప్లై చైన్‌తో అనుసంధానం..

చిప్ డిజైన్, సెమీకండక్టర్ తయారీ, ఎలక్ట్రానిక్ విడిభాగాల ఉత్పత్తిలో తెలంగాణను అగ్రస్థానంలో నిలపడం ప్రభుత్వ లక్ష్యమన్నారు. పరిశోధన, ఉత్పత్తుల రూపకల్పన నుంచి విడిభాగాలు, తుది ఉత్పత్తుల తయారీ వరకు అన్ని కార్యకలాపాలు రాష్ట్రంలోనే జరిగేలా కంపెనీలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. స్థానిక పరిశ్రమలను అంతర్జాతీయ సరఫరా వ్యవస్థతో అనుసంధానించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

యువతకు నైపుణ్య శిక్షణ.. ఉపాధి అవకాశాలు..

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని మంత్రి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మివి సంస్థ ఇప్పటికే ఇయర్‌బడ్స్, హెడ్‌ఫోన్స్, స్పీకర్లు, సౌండ్‌బార్లు వంటి ఆడియో ఉత్పత్తులను తయారు చేస్తోందని వివరించారు. తాజాగా మివి వన్ 5జీ స్మార్ట్‌ఫోన్‌తో మొబైల్ తయారీ రంగంలోకి కూడా ప్రవేశించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ ఎండీ శశాంక, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, మివి ప్రతినిధులు విశ్వనాథ్ కందుల, మిధుల దేవభక్తుని తదితరులు పాల్గొన్నారు.